## సమాచారం

### నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పోచారం: మరమ్మతుల కారణంగా పోచారం లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. పోచారం, అన్నానగర్, జోడిమెట్ల క్రాస్ రోడ్, వైభవ్ కాలనీ, డాక్టర్స్ కాలనీ, విజయపురి, శరణ్య హిల్స్, గ్యాలాక్సీ టవర్స్‌తో పాటు పరిసర కాలనీలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉడదని, వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## క్లుప్తంగా...

### 'ఓట్ల కోసమే కంటి వెలుగు'



శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఓట్ల కోసమే కంటి వెలుగు ప్రారంభించారని, అవసరమైన వారికి ఆపరేషన్లు ఎందుకు చేయించడం లేదని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి ప్రశ్నించారు. బుధవారం అవుషాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ కావేరి మశ్చేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. పిల్లలకు ఓట్లు లేవనే విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించడం లేదని, రూ.వంద విలువ చేసే ఆరేడు కళ్లద్దాలు నిత్యం అందజేస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కంటి పరీక్షల పేరుతో ప్రచారం చేసుకోవడం మాని అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు, కళ్లద్దాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఐలయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, మశ్చేందర్‌రెడ్డి, వామన్‌రెడ్డి, సాయిలు కంటి నిపుణులు సౌమ్య పాల్గొన్నారు.

### అంబులెన్స్‌ల పరిశీలన



సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా మేనేజర్

మేడ్చల్: జిల్లాలో నడుస్తున్న 108, 102, 962 అంబులెన్స్‌లను ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ షేక్ జాన్ షాహిద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బంది పనితీరును పరిశీలించి రికార్డులు, పరికరాలను తనిఖీ చేశారు. సిబ్బంది సమర్థవంతంగా పని చేయాలని సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కోర్డినేటర్ సతీష్, వాహనాల సిబ్బంది పాల్గొన్నారు.

### 'డబుల్' ఇళ్లు కేటాయించడంలో ప్రభుత్వం విఫలం

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి



కుషాయిగూడ: రాష్ట్రంలో డబుల్ ఇళ్ల కేటాయింపు, దళితబంధు పథకం అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత రాగిడి లక్ష్మారెడ్డి విమర్శించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం హెచ్‌బీకాలనీ, ఇందిరానగర్ చౌరస్తాలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ శ్రేణులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రేపు మాపు అంటూ డబుల్ ఇళ్ల కేటాయింపును వాయిదా వేస్తూ వస్తున్న ప్రభుత్వం ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. ఇక దళితబంధు పథకానికి పూర్తిగా రాజకీయ రంగు పులిమి కేవలం బీఆర్‌ఎస్ పార్టీ వారికి మాత్రమే పథకాన్ని పరిమితం చేశారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో మరోమారు ప్రజలను మోసం చేసేందుకు సీఎం కేసీఆర్ కుట్ర పన్నుతున్నాడని అన్నారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తున్న బీఆర్‌ఎస్‌కు రాబోయే ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. నాయకులు పోలేపాక అంజయ్య, సంజీవరెడ్డి, మేడల మల్లికార్జున్‌గౌడ్, యాకుబ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అస్వస్థతకు గురైన పార్టీ సీనియర్ నేత జలగం వెంకటేశంను ఆయన పరామర్శించారు.

### రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవాలు

మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్‌లోని ఆదర్శనగర్‌లో షిర్డీ సాయిబాబాతో పాటు పలు దేవతా విగ్రహాల ప్రతిష్ఠామహోత్సవం ఉంటుందని ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. యంత్ర ప్రతిష్ఠ, షిరిడీసాయిబాబా, మహాగణపతి, రామలింగేశ్వర, లలితాపరమేశ్వరిదేవి, వల్లీ దేవసేన సహిత సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయ, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠ ఉంటుందని తెలిపారు. అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

# బీఆర్‌ఎస్‌లో తిరుగుబావుటా

## మంత్రి మల్లారెడ్డి ఆదేశాలను ఖాతరు చేయని సొంత పార్టీ కార్యకర్తలు

**అధికార పార్టీ బీఆర్‌ఎస్‌లో తిరుగుబాటు జెండా ఎగురుతోంది. నగర పాలక సంస్థ, మున్సిపాలిటీల్లో సొంత పార్టీ మేయర్లు, చైర్మన్ల పైనే అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసులు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అందజేయడం ఆ పార్టీ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.**



దమ్మాయిగూడ చైర్‌పర్సన్‌పై కలెక్టరేట్‌లో అవిశ్వాసం నోటీసును అందజేస్తున్న కౌన్సిలర్లు

- తాజాగా దమ్మాయిగూడ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం
- 14 మంది కౌన్సిలర్లు కలిసి కలెక్టరేట్‌లో నోటీసు అందజేత
- జవహర్‌నగర్, మేడ్చల్ పురపాలికల్లోనూ తిరగబడిన సొంత పార్టీ సభ్యులు
- మేడ్చల్ నియోజకవర్గంలో మరో 4 పురపాలికల్లో ఇదే పరిస్థితి
- ఇటీవల జిల్లాకు చెందిన పార్టీ ఎమ్మెల్యేలు కూడా...
- అసమ్మతి వాదుల బుజ్జగింపు పర్వానికి తెరలేపిన మంత్రి

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు ఉండగా, మంత్రి చామకూర మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు ఆయన ఆదేశాలను బేఖాతరు చేస్తూ.. కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసులు సమర్పించడంపై బీఆర్‌ఎస్ కేడర్‌ను తీవ్ర అయోమయానికి గురిచేస్తోంది. సొంత బంధువులు ప్రాతినిధ్యం వహిస్తున్న పురపాలక సంఘాల్లో కూడా కౌన్సిలర్లు మంత్రి మల్లారెడ్డి గీత దాటడంతో పాటు విపక్షాలతో చేతులు కలపడం వంటి విషయాలు రాజకీయ వర్గాలను తీవ్ర ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రాష్ట్రంలోనే అత్యధిక పురపాలక సంఘాలు కలిగిన శాసన సభా నియోజకవర్గంగా మేడ్చల్‌కు పేరుంది. ఇక్కడనే స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మల్లారెడ్డి ఆదేశాలను బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు, కౌన్సిలర్లు పాటించక పోవడంతో పట్టును కోల్పోతున్నారన్న చర్చ పార్టీ వర్గాల్లో వ్యక్త మవుతోంది. అలాగే మేడ్చల్ నియోజకవర్గంలోని పలు పురపాలక సంఘాలకు చెందిన డిప్యూటీ మేయర్లు, వైస్ చైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు కూడా అదే పార్టీకి చెందిన మేయర్లు, చైర్మన్లపై అవిశ్వాసం నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఈ విషయాన్ని పసిగట్టిన మంత్రి మల్లారెడ్డి వివిధ మార్గాల ద్వారా అసమ్మతి వాదులను బుజ్జగించే పనిలో నిమగ్నమైనట్లు సమాచారం. బుధవారం 'మన ఊరు–మన బడి' కింద మరమ్మతులు పూర్తయిన ప్రభుత్వ పాఠశాలల భవనాల ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి మల్లారెడ్డి పోచారం, పీర్జాదిగూడ, బోడుప్పల్ పురపాలక సంఘాల్లోని అసమ్మతి వాదులతో సమావేశమై.. బుజ్జగింపుల పర్వానికి తెర లేపినట్లు తెలుస్తోంది.

### బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కూడా...

మంత్రి మల్లారెడ్డిపై దాదాపు నెల రోజుల కిందట మల్కాజిగిరి ఎమ్మెల్యే, సీనియర్ బీఆర్‌ఎస్ నేత మైనంపల్లి హన్మంతరావు ఇంట్లో సమావేశమైన జిల్లాకు చెందిన ఆ పార్టీ ఎమ్మెల్యేలు పలు ఆరోపణలతో తిరుగుబావుటా ఎగురవేసిన విషయం తెల్సిందే. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ ఆదేశాలను ఖాతరు చేయకుండా నామినేటెడ్ పదవులను మంత్రి మల్లారెడ్డి సొంత నియోజకవర్గం వారికి కట్టబెట్టారని ఎమ్మెల్యేలు ఆరోపించారు. అలాగే తమ నియోజక వర్గాల్లో అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు విషయంలో కలెక్టర్‌ను మంత్రి పక్కదారి పట్టిస్తున్నారని ఎమ్మెల్యేలు విమర్శిస్తున్నారు. మంత్రి మల్లారెడ్డి వ్యవహార శైలిపై సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యేలు అప్పట్లోనే మీడియా సమావేశంలో ప్రకటించారు.

### జవహర్‌నగర్ బాటలో మరికొన్ని..

మేడ్చల్ నియోజకవర్గంలోని జవహర్‌నగర్ కార్పొరేషన్ మేయర్ మేకల కావ్యపై 20 మంది కార్పొరేటర్లు ఇటీవల కలెక్టర్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. మేడ్చల్ మున్సిపల్ చైర్మన్ మర్రి దీపికపై 15 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం తీర్మానానికి సంబంధించిన నోటీసు కలెక్టర్ కార్యాలయంలో అంద జేశారు. తెలంగాణ మున్సిపాలిటీ యాక్ట్ 2019 సెక్షన్ 37 అనుసరించి నో కాన్ఫిడెన్స్ మోషన్ పిటిషన్ చైర్మన్‌కు వ్యతిరేకంగా సమర్పిస్తున్నట్లు వారు నోటీసులో పేర్కొన్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని మరో 4 పురపాలక సంఘాలకు చెందిన అధికార బీఆర్‌ఎస్‌కు చెందిన అసమ్మతి కార్పొరేటర్లు, కౌన్సిలర్లు అవిశ్వాసం నోటీసులు కలెక్టర్‌కు అందజేసేందుకు సిద్ధమవుతున్నారు.

### తాజాగా దమ్మాయిగూడలో ...

మేడ్చల్ నియోజకవర్గంలోని దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన 14 మంది కౌన్సిలర్లు బుధవారం చైర్‌పర్సన్ ప్రణీతపై అవిశ్వాస తీర్మానానికి సంబంధించిన నోటీసును కలెక్టర్‌కు అందజేశారు. నోటీసుపై సంతకం చేసిన వారిలో 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, 10, 12, 16, 17, 18 వార్డులకు చెందిన కౌన్సిలర్లు ఉన్నారు. నోటీసు ఇచ్చిన ఆ 14 మంది కౌన్సిలర్లలో ముగ్గురు కాంగ్రెస్ వారు కాగా, మిగతా 11 మంది కౌన్సిలర్లు అధికార బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన వారే కావడం విశేషం. వీరంతా మంగళవారమే కలెక్టర్‌కు అవిశ్వాసం నోటీసు ఇచ్చేందుకు కలెక్టరేట్‌కు వెళ్లగా సమయం దాటి పోవడంతో బుధవారం అందజేశారు. అలాగే, రాంపల్లి దాయార ప్రాంతంలోని ఒక గార్డెన్‌లో సమావేశమైన దమ్మాయిగూడ మున్సిపాలిటీకి చెందిన అసమ్మతి కౌన్సిలర్లు అవసరమైతే రాజీనామాలకు కూడా సిద్ధపడాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



విద్యార్థులతో కలిసి నినాదాలు చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, చైర్మన్ కొండల్‌రెడ్డి

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

**మంత్రి చామకూర మల్లారెడ్డి**



పాఠశాలలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.76 కోట్ల నిధులు వెచ్చించామని తెలంగాణ కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం పోచారంలోని ప్రాథమిక పాఠశాలలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా పూర్తి చేసిన అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. దీంతో ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు దొరకని పరిస్థితి ఉందన్నారు. రూ.20.87 లక్షల నిధులతో పోచారం ప్రాథమిక పాఠశాలలోని తరగతి గదుల్లో రైటింగ్ బోర్డులు, బెంజీలు ఏర్పాటు చేయడంతో పాటు బిల్డింగ్‌కు పెయింటింగ్ వేశామన్నారు. వంట శాలలు, టాయిలెట్స్ వంటి వసతులు కల్పించామన్నారు. జిల్లాలో 176 స్కూళ్లను ఇదేవిధంగా అభివృద్ధి చేశామన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణ ప్రభుత్వం విద్యపై ఎక్కువ నిధులు ఖర్చు చేస్తోందని, అంబేడ్కర్ ఆశయ సాధన కోసం కృషి చేస్తున్న సీఎం కేసీఆర్ పట్ల కృతజ్ఞతా భావంతో ఉండాలని మంత్రి హితవు పలికారు. చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు సామల శ్రీలత బుచ్చిరెడ్డి, బద్దం మమత జగన్మోహన్‌రెడ్డి, చింతల రాజశేఖర్, మెట్టు బాల్‌రెడ్డి, సింగిరెడ్డి సాయిరెడ్డి, ఆకిటి శైలజ బాల్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు రజిత, బీఆర్‌ఎస్ నాయకులు నల్లవెల్లి శేఖర్, నర్రి కాశయ్య, అబ్బవతిని నర్సింహ, రాజేశ్వర్‌రెడ్డి, కేఎం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎదులాబాద్ పంచాయతీ రికార్డుల తనిఖీ



విచారణ జరుపుతున్న డీఆర్‌డీఓ పద్మజారాణి, ఎంపీఓ నందకిశోర్

ఘట్‌కేసర్: ఎదులాబాద్ సర్పంచ్ సురేశ్, బిల్‌కలెక్టర్ రజినీకర్‌రెడ్డి అవినీతికి పాల్పడుతున్నారన్న పాలక వర్గ సభ్యుల ఫిర్యాదుపై డీఆర్‌డీఓ పద్మజారాణి ఆ గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం విచారణ చేపట్టారు. ఇంటి అనుమతుల కోసం ఎన్ని నకిలీ రశీదులు ఇచ్చారు? ఎందుకు ఇచ్చారు? ఎన్ని పుస్తకాలు ఉన్నాయన్న విషయంపై బిల్‌కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇంటి అనుమతి కోసం యజమానులు చెల్లించిన డబ్బు ఎస్టీఓలో జమ చేసిన రికార్డులు తనిఖీ చేశారు. పూర్తి వివరాలతో నివేదికను జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేస్తానని విచారణ అధికారి పద్మజారాణి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ నందకిశోర్, ఉప సర్పంచ్ లింగేశ్వర్, కార్యదర్శి ఉష, వార్డు సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు ముదిరాజ్, గణేశ్, సురేశ్, రాంచందర్, నందకుమార్ పాల్గొన్నారు.

# ఆర్‌పీల సమస్యలు పరిష్కరించండి



మంత్రి మల్లారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆర్‌పీలు

మేడ్చల్: మున్సిపాలిటీల్లో ఆర్‌పీలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరింపజేయాలని ఆర్‌పీలు కోరారు. ఈ మేరకు మంత్రి నివాసంలో బుధవారం మల్లారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. తమ సమస్యలను మంత్రికి వివరించి అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తమ సమస్యలను తీసుకెళ్లి పరిష్కరింపచేయాలని ఆర్‌పీలు కోరారు. మంత్రికి వినతి పత్రం ఇచ్చిన అనంతరం మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి రాజశేఖర్‌రెడ్డిని కూడా కలిసి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్‌ఎస్‌కేవీ అధ్యక్షుడు ప్రభాకర్, ఆర్పీలు మంగాదేవి, రజియా, కవిత, లోలాక్షి, స్వప్న, మంజుల, లావణ్య, జ్యోతి, సుకన్య తదితరులు ఉన్నారు.

# వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని కాశీపురంలో శాన్వి ప్రైడ్‌హోమ్స్‌లో నూతనంగా నిర్మించిన సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణదారులు జీఎల్. మహేష్‌కుమార్, సురేష్‌కుమార్, డెవలపర్ ఎం.కృష్ణారెడ్డిల సహకారంతో సహకారంతో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఉదయం నుంచి యజ్ఞం, హోమాలను వేద పండితుల సమక్షంలో నిర్వహించారు. సీతారామచంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్లు రాజ్‌జితేంద్రనాథ్, శాంతి శ్రీనివాస్‌రెడ్డి, సబితాకిషోర్ హాజరవుతారని తెలిపారు.

# విద్యార్థులకు మోటివేషన్ తరగతులు



స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్: మున్సిపాలిటీ పరిధిలోని అత్వెల్లి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించారు. ప్రస్తుత, విశ్రాంత ఉపాధ్యాయులు తరగతులు నిర్వహించి విద్యార్థులకు పరీక్షల మెళుకువలు నేర్పించారు. విద్యార్థులు ఇష్టంతో కష్టపడి ప్రణాళికాబద్ధంగా చదవాలన్నారు. జీవితంలో రాణించడానికి ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని సూచించారు. సమావేశానంతరం పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు మురళీమనోహర్, ఉపాధ్యాయులు రామారావు, నవీన్, మంజుల, వసీం తదితరులు పాల్గొన్నారు.

# పనుల్లో నాణ్యత లోపించొద్దు



పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ పావనీయాదవ్

ఘట్‌కేసర్: పాఠశాల అదనపు తరగతి గది నిర్మాణపు పనుల్లో నాణ్యత లోపించొద్దని చైర్‌పర్సన్ పావనీయాదవ్ అన్నారు. 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జెడ్పీ బాలుర, బాలికల పాఠశాలల్లో నిర్మిస్తున్న అదనపు గదుల నిర్మాణపు పనులను వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను ప్రభుత్వం అభివృద్ధి చేస్తుందని, ప్రైవేటు పాఠశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలు ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జంగయ్యయాదవ్, హెచ్‌ఎంలు పాపిరెడ్డి, అనిత, బీఆర్‌ఎస్ నాయకులు మాధవరెడ్డి, రహీం, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్ పాల్గొన్నారు.

# కంటి వెలుగు శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య

పోచారం: అన్నోజిగూడలోని ఎస్‌సీ కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి వెలుగు శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో చైర్మన్ కొండల్‌రెడ్డి, వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కమిషనర్ సురేష్, కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.



కంటి అద్దాలు అందజేస్తున్న కౌన్సిలర్లు

### మేడ్చల్ మున్సిపాలిటీ 3వ వార్డులో...

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ వైస్ చైర్మన్ రమేష్, వార్డు కౌన్సిలర్ దేవతో కలిసి ప్రారంభించారు. వార్డు ప్రజలు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు కంటి అద్దాలను పొందాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు సాయికుమార్, నర్సింహ స్వామి యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు రవిందర్‌రెడ్డి, సరేందర్, సందీప్‌గౌడ్, మధుకర్‌యాదవ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## క్రైం కార్నర్..

### వేర్వేరు ఘటనల్లో ఇద్దరి అదృశ్యం



స్వాతి



ఎ: శ్రీదేవి

జవహర్‌నగర్: ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న యువతి ఇంట్లో ఇంటర్వ్యూకు వెళ్తున్నానని చెప్పి వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాని ఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరాల ప్రకారం... జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని న్యూ గబ్బిలాలపేటలో నివాసం ఉంటున్న స్వాతి(25) డిగ్రీ పూర్తి చేసింది. కొద్ది రోజులుగా ఉద్యోగం కోసం ప్రయత్నాలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో గత నెల 31న ఇంటర్వ్యూ ఉందంటూ ఇంట్లో చెప్పి వెళ్లిపోయిన స్వాతి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె సోదరుడు బంధువులు, స్నేహితుల వద్ద స్వాతి గురించి ఆరా తీయగా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**మరో ఘటనలో...**

జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో నివాసముంటున్న వెంకటమ్మ కూతురు పిట్ట శ్రీదేవి(31) మతిస్థిమితం లేకపోవడంతో జనవరి 26న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆమె కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# మాసమని ఏడాదైనా..!

- నెల రోజుల్లో పట్టాలిస్తామని సంవత్సరమైనా సాగుతూనే ఉన్న క్రమబద్ధీకరణ
- ఏడాది క్రితం జీఓ 58, 59 అమలు పరుస్తామని జవహర్‌నగర్ ప్రజలకు మంత్రి కేటీఆర్ హామీ

**ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జవహర్‌నగర్ వాసులు**



గతేడాది ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, చిత్రంలో మంత్రి మల్లారెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి కేటీఆర్ (ఫైల్)

జవహర్‌నగర్: సరిగ్గా ఏడాది క్రితం జవహర్‌నగర్‌కు వచ్చిన రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్.. మీ ఇండ్లను క్రమబద్ధీకరించి నెల రోజుల్లో పట్టాలు మీ చేతికి అందిస్తామని జవహర్‌నగర్ వాసులకు హామీ ఇచ్చారు. నేటికీ ఆ హామీ నెరవేరకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు గుర్రుగా ఉన్నారు. ఇందులో భాగంగా 2022 ఫిబ్రవరి 2న మంత్రి మల్లారెడ్డితో కలిసి జవహర్‌నగర్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన మంత్రి కేటీఆర్ రోడ్‌షో నిర్వహించి నెల రోజుల్లో జవహర్‌నగర్ వాసులకు పట్టాలిస్తానని, లేకుంటే జవహర్‌నగర్‌లో అడుగుపెట్టనని శపథం చేశారు. స్థానిక ప్రజలకు మాట ఇచ్చి సంవత్సరం గడిచినా ఇప్పటి వరకు ఒక్క పట్టా ఇవ్వకపోగా, జీఓ 58, 59 అమలు పర్చడంలో విఫలమయ్యారు. ప్రభుత్వ స్థలాల్లో నివాసముంటున్న వారందరికీ నెల రోజుల్లోపు నివాస హక్కులు కల్పిస్తామని స్వయంగా మంత్రి మల్లారెడ్డి ఏర్పాటు చేసిన సభలో పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పాలకవర్గం సమక్షంలో ప్రకటించారు. అంతేకాకుండా జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో రూ.36.20 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, రూ.15 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు, రూ.10 కోట్లతో మిషన్ భగీరథ, రూ.2కోట్లతో చెన్నాపురం చెరువు సుందరీకరణ, రూ.2కోట్లతో వైకుంఠధామ నిర్మాణ పనులు, రూ.7.20 కోట్లతో వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఏర్పాట్ల కోసం శంకుస్థాపన చేశారు. అయినా ఇప్పటి వరకు ఆ హామీలు నీటి మూటలు గానే మిగిపోయాయి. కేవలం వెజ్–నాన్‌వెజ్ మార్కెట్ పనులు ప్రారంభ దశలో ఉన్నా మిగిలిన పనులన్నీ అటకెక్కాయి. ప్రస్తుతం ప్రధాన రహదారి అధ్వాన స్థితిలో ఉంది. ఇప్పటికైనా మంత్రి మల్లారెడ్డి చొరవ తీసుకుని ఇచ్చిన హామీలు అమలు చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

### 'బూటకపు మాటలే..'



కేంద్రం సహకరించకున్నా అభివృద్ధి చేస్తున్నామని, జవహర్‌నగర్‌లో పేదలందరికీ నెల రోజుల్లోపు పట్టాలిస్తామని స్వయంగా మంత్రి కేటీఆర్‌యే అన్నారు. రోడ్‌షోకి వచ్చిన క్రమంలో కాంగ్రెస్ నాయకులను పోలీసులతో నిర్బంధించి దొరల పాలన అని నిరూపించుకున్నారు. మాట నిలబెట్టుకున్నాకనే జవహర్‌నగర్‌కు వస్తానని శపథం చేశారు. మాట ఇచ్చి సంవత్సరం గడిచినా ఇప్పటి వరకు ఒక్క పట్టా ఇవ్వకపోవడం బీఆర్‌ఎస్ పాలనకు అద్దం పడుతుంది. ఇక ప్రభుత్వంపై పోరాటాన్ని ఉధృతం చేస్తాం.

– మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, కాంగ్రెస్ అధ్యక్షుడు, జవహర్‌నగర్

### 'మాటల గారడీతోనే కాలం వెళ్లదీస్తున్నారు..'



బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాటల గారడీతోనే కాలం వెళ్లదీస్తోంది. ఎన్నికలకు ముందు మిషన్ భగీరథ, క్రమబద్ధీకరణ పేరుతో మరెన్నో హామీలు గుప్పించి పేదలను మోసం చేయాలని ఇంకా ప్రయత్నిస్తున్నారు. జవహర్‌నగర్‌లో మరోసారి పర్యటిస్తే అర్థం అవుతోంది ఏ మాత్రం అభివృద్ధి చేశారో.. బీఆర్‌ఎస్ అరాచక పాలనను ప్రజలు గమనిస్తున్నారు. కేవలం ప్రకటనలకే బీఆర్‌ఎస్ నాయకులు పరిమితమయ్యారు.

– రంగుల శంకర్‌నేత, బీజేపీ అధ్యక్షుడు, జవహర్‌నగర్

### 'హామీలన్నీ అమలవుతాయి'



మంత్రులు కేటీఆర్, మల్లారెడ్డి ఇచ్చిన ప్రతీ హామీ నెరవేరుతుంది. ఇప్పటికే 2014 సంవత్సరానికి ముందు ఉన్న నివాసాలన్నింటికీ జీఓ 58, 59 ప్రకారం.. అధికారులు సర్వే నిర్వహించారు. గత ప్రభుత్వం హయాంలో జవహర్‌నగర్‌లో అడుగు తీసి అడుగేయని పరిస్థితి. ప్రస్తుత కార్పొరేషన్‌లో కోట్ల రూపాయల నిధులతో జవహర్‌నగర్ దశ, దిశలను మార్చేలా ప్రణాళికలు రూపొందించి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ముందుకు సాగుతోంది.

– బాషోని కొండల్ ముదిరాజ్, బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, జవహర్‌నగర్